భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 19.0



## బీచ్‌లో సండే సందడి

మొగల్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లు పర్యాటకులతో కళకళలాడాయి. ఆఖరి ఆదివారం కావడంతో సందర్శకుల పెద్దసంఖ్యలో విచ్చేశారు. సముద్ర స్నానం చేసి సేద తీరారు. డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆధ్వర్యంలో ఒక సీఐ, నలుగురు ఎస్ఐలు, 80 మంది పోలీస్ సిబ్బంది బందోబస్త్‌లో పాల్గొన్నారు. తీరం వెంబడి తోటల్లో మద్యం సేవించకుండా అడ్డుకున్నారు.పేకాట ఆడుతున్న కొందరిని అదుపులోకి తీసుకున్నారు.



## ముగిసిన మావుళ్లమ్మ దీక్షలు

దీక్షాధారులు ఆదివారం మంగళ వాయిద్యాలతో గ్రామ ప్రదక్షిణ నిర్వహించి మావుళ్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులను సమర్పించారు. హోమగుండంలో ద్రవ్యాలను వేసి దీక్షలను విరమించారు. - 7లో..




తాడేపల్లిగూడెంలో మధ్యలో నిలిచిన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం

## సారూ..మరిచారా..!

ఇదేంటి సారు... మొదలు పెట్టి మధ్యలోనే వదిలేశారు. సర్కారుతో కలిసి ప్రజలకు సేవలందిద్దామనుకుంటే చిన్నచూపు చూస్తున్నారు.. 2018లో అప్పటి మంత్రి పైడికొండల మాణిక్యాలరావు చేతుల మీదుగా మొదలైన నా ప్రయాణం సర్కారు మారడంతో మధ్యలోనే ఆగిపోయింది. రూ.90 లక్షల వ్యయంతో పనులు మొదలు పెట్టి సగంలోనే వదిలేశారు. నాతోపాటు మొదలైన స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం, ఫైర్‌స్టేషన్ పనులు పూర్తిచేసుకుని సేవలందిస్తుంటే నన్ను మాత్రం చూడడం లేదు..ఎమ్మెల్యే గారూ.. ఒక్కసారి నావైపు దృష్టిపెట్టి పని పూర్తిచేస్తే పదిమందికి సేవలందిస్తాను.. ఇరుకు గదుల్లో కాలం గడుపుతున్న రెవెన్యూ అధికారులకు కూడా కాస్త రిలాక్స్ దొరుకుతుంది... ఓసారి చూడరూ !

- తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)



## యువతకు స్ఫూర్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

మార్టేరులో విగ్రహం ఆవిష్కరించిన మంత్రి జనార్ధనరెడ్డి



## దిగి రానంటున్న కూరగాయలు

- మహారాష్ట్ర నుంచి నాసిరకం ఉల్లి
- క్వింటా రూ.1,300 నుంచి 1,800 మధ్యనే. 7
- నిలకడగా చికెన్ ధరలు

# రబీకి రెడీ

జిల్లాలో రబీ సాగుకు ప్రణాళిక రెడీ అయింది. విత్తనాలను సిద్ధం చేశారు. ప్రతీ ఎకరాకు రబీ సాగులో సాగు నీరు అందించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సార్వా మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో అధికారులు రబీ సాగకు ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని విషయాలపైనా దృష్టి పెట్టారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- ప్రతీ ఎకరాకు సాగునీరు
- ఎరువుల కొరత లేకుండా ప్లాన్
- డిమాండ్ ఉన్న రకాలకే రైతుల మొగ్గు
- 43,163 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

రబీ గట్టెక్కాలంటే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు దాదాపు 80 టీఎంసీల సాగునీరు అవసరం అవుతుంది. గోదావరిలో 25 టీఎంసీలు నీరు లభ్యం అవుతోందని ప్రాథమికంగా అంచనా వేశారు. మరో 55 నుంచి 60 టీఎంసీలు సీలేరు ప్రాజెక్టు నుంచి అందుబాటులోకి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తంపైన రబీ సాగులో నీటి ఇబ్బంది లేకుండా ప్రణాళిక రూపకల్పన చేశారు. జిల్లాలోనే 86,325 హెక్టార్లలో వరి సాగు చెయ్యనున్నారు.అందుకోసం 43,163 క్వింటాళ్ళ విత్తనాలు సిద్ధం చేశారు. ప్రైవేట్ పరంగాను రైతులు 36, 832 క్వింటాళ్లు సిద్ధం చేసుకుంటున్నారని వ్యవసాయ శాఖ అంచనాలో ఉంది. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను సిద్ధం చేసింది.

### విత్తన రకాలు ఇవే

రబీలో సాగు చెయ్యవలసిన రకాలపై వ్యవసాయ శాఖ రైతులను అప్రమత్తం చేసింది. అత్యధికంగా ఎంటియు 1318 రకం సాగు చెయ్యనున్నారు. జిల్లాలో 39,600 హెక్టార్లలో ఇదే విత్తనాన్ని సాగు చేస్తారు. ఆ తరువాత ఎంటీయూ 7029 రకాన్ని సుమారు 19 వేల 675 హెక్టార్లలో సాగు చేసేందుకు ప్రణాళిక చేశారు. అదేవిధంగా సంపద స్వర్ణ విత్తనాన్ని 14 వేల 500 హెక్టార్లలో మిగిలిన విస్తీర్ణంలో ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1153 విత్తన రకాలను రైతులు సాగు సాగు చేసేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించింది

### యూరియాతోనే పొంచి ఉన్న ముప్పు

రబీ సాగు అవసరాల కోసం జిల్లాలలో 42 వేల టన్నుల యూరియా అవసరం కానుంది. ప్రస్తుతం 8 వేల టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. ఇది ఇప్పుడు వాణిజ్య వర్గాలల్లో చర్చ సాగుతోంది. ఐతే అధికారులు మాత్రం ధీమాతో ఉన్నారు. రానున్న డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో జిల్లాకు రావలసి కోటాను యథాతధంగా సరఫరా చేస్తే యూరియాకు ఎటువంటి కొరత ఉండదని జిల్లా వ్యవసాయ శాఖ గట్టి నమ్మకంతో ఉంది. మరో వైపు వాడకాన్ని తగ్గించాలని ప్రభుత్వం సూచిస్తోంది. రైతుల్లో అవగాహన కల్పించాలని మార్గదర్శకాలను జారీ చేసింది. యూరియా వంటి ఎరువుల వినియోగం తగ్గించటం వల్ల వరికి చీడ, పీడ బాధ పెద్దగా ఉండదూ గడచిన కొనేళ్ళుగా రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ వస్తున్నారు. ఫలితంగా పురుగు మందుల వాడకం కూడా తగ్గుతోంది. మరో వైపు ధాన్యం దిగుబడులు పెరుగుతున్నాయి.



పెనుగొండ మండలం కొఠాలపర్రులో సార్వా కోతలు

### పుష్కలంగా కాంప్లెక్స్ ఎరువులు

ప్రస్తుత రబీలో 62 వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరం కానున్నాయని అధికారలు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 34 వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా డీఏపీ, పొటాష్, ఇతర కాంప్లెక్స్ ఎరువులను కంపెనీలు జిల్లాకు డంప్ చేస్తున్నాయి. ఫలితంగా ఆ కాంప్లెక్స్ ఎరువులకు ఎటువంటి ఇబ్బంది లేదు. రానున్న రోజులల్లోను విరివిగా కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్క యూరియా పైనే అనుమానం వ్యక్తం అవుతున్నాయి. ఖరీఫ్‌లో జిల్లాకు కేటాయించిన కోటాను ఇతర జిల్లాలకు తరలించారు. పశ్చిమ డెల్టాలో నిజానికి ఖరీఫ్‌లో యూరియాను తక్కువగా వినియోగిస్తారు. ఫలితంగా జిల్లా రైతులు ఖరీఫ్ సీజన్‌లో యూరియాకు అంతగా ఇబ్బంది పడలేదు. జిల్లాలోని యూరియా నిల్వలను అవసరానికి తగ్గట్టుగా సొసైటీలకు ప్రైవేట్ వ్యాపారులకు పంపిణీ చేస్తూ వచ్చారు. ఫలితంగా యూరియా కొరత లేకుండా ఖరీఫ్ సాగు సాఫీగా గట్టెక్కింది. రబీలో మాత్రం రైతులు అధికంగా యూరియాను వినియోగిస్తూంటారు. ప్రభుత్వం జిల్లా కోటాను సక్రమంగా సరఫరా చెయ్యకపోతే ఇబ్బంది పడే అవకాశం ఉంది.

## నరసాపురంలో అదృశ్యం.. కేరళలో చిక్కిన బాలుడు

నరసాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న అదృశ్యమైన బాలుడు ఆచూకీ ఆదివారం కేరళలోని ఎర్నాకులం రైల్వేస్టేషన్‌లో పోలీసులు కనుగొన్నారు. నరసాపురం పట్టణంలోని 10వ వార్డుకు చెందిన పదేళ్ల బాలుడు చదవకుండా సెల్‌ఫోన్‌తో ఆడుకుంటున్నాడని తల్లి మందలించింది. దీనికి అలిగి బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడ నుంచి కేరళ వెళ్లే రైలు ఎక్కాడు. అయితే ఈ విషయం తెలియని తల్లితండ్రులు సాయంత్రం అయినా బాలుడు రాకపోవడంతో ఆందోళన చెందాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా బాలుడు రైల్వేస్టేషన్‌కు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే అన్ని రైల్వేస్టేషన్లను అలర్ట్ చేశారు. ఇదిలా ఉంటే ఎర్నాకులం రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు గుర్తించి ఆరా తీశారు. దీంతో విషయం చెప్పడంతో నరసాపురం పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై జయలక్ష్మి చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లితండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. బాలుడిని తీసుకొచ్చేందుకు ఎర్నాకులం వెళ్లారు.



## మిగిలింది అర్బన్ బ్యాంకే !

### చైర్మన్ గిరి ఎవరికో..?

### నరసాపురంలో ఉత్కంఠ

నరసాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసాపురం నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల ప్రక్రియ దాదాపు పూర్తయింది. మార్కెట్‌యార్డుతో పాటు సొసైటీలు, ఆలయ ట్రస్టు పాలకవర్గాల నియామకాలను కూటమి నాయకులు పూర్తిచేశారు. ఇంకా అర్బన్ సొసైటీ బ్యాంకు పాలక మండలి ఒక్కటి మాత్రమే మిగిలింది. కీలకమైన ఈ బ్యాంకు చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందోనన్నది కూటమిలో చర్చనీయాంశమైంది. దాదాపు రూ.18 కోట్లు డిపాజిట్లు కలిగిన ఈ సొసైటీ పాలకవర్గ నియామకం కూటమికి సైతం కత్తిమీద సాములా మారింది. గతంలో సంక్షోభంలో కూరుకుపోయిన ఈ బ్యాంకు మళ్లీ లాభాల బాట పట్టింది. ఖాతాదారుల నమ్మకం పెంచుకుంది. నరసాపురం, మొగల్తూరు, పట్టణాలకు చెందిన చాలామంది బ్యాంకు ఖాతాదారులుగా ఉన్నారు.ఈ నేపథ్యంలో పాలకమండలి బ్యాంకుకు కీలకమైంది. ప్రస్తుతం కోఆపరేటివ్ అధికారుల పర్యవేక్షణలో పాలన సాగుతోంది. గత కమిటీ పాలకవర్గం పదవీకాలం పూర్తయింది. కూటమి అధికారంలోకి రాగానే బ్యాంకు చైర్మన్ పదవిపై పలువురు ఆసక్తి చూపారు. అయితే ఇప్పటివరకు పాలకవర్గం భర్తీ కాకపోవడంతో స్థానిక పదవులు రానివారు బ్యాంకు చైర్మన్ పదవి కోసం నేతలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. కూటమి నాయకులు పాలకవర్గ నియామకంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. సమర్థవంతమైన వ్యక్తికి పగ్గాలు అప్పగించాలని యోచిస్తున్నారు. టీడీపీ తరఫున కొవ్వలి నాయుడు ముఖ్య అనుచరుడుగా ఉన్న సంకు భాస్కర్ పేరుతో పాటు జనసేన నుంచి కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని పేర్లు వినిపిస్తున్నాయి. వీరితో పాటు ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి కూడా ఒక వ్యాపారవేత్త పేరు షికారు చేస్తున్నది. కూటమి నాయకులు కూడా ఖాళీగా ఉన్న ఈ పాలకవర్గాన్ని భర్తీ చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకు సాగాలని యోచిస్తున్నారు.

# పట్టణాల్లో డిజి-లక్ష్మి సేవలు



- మెప్మా ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు
- మహిళలకు ఉపాధి మార్గం..
- త్వరలో తణుకులో ప్రారంభం
- ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించిన మెప్మా పీడీ హెబ్సీబా

భీమవరం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోని ప్రజలు ఏదైనా ధ్రువీకరణపత్రాలు సేవల కోసం ఇప్పటి వరకు మీ సేవా కేంద్రాలు, సచివాలయాలకు వెళ్లవలసి వస్తున్నది. ఇక నుంచి ఈ సేవలన్నీ ఒకేచోట అందించడానికి పట్టణ ప్రాంతాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మెప్మా సంస్థ ద్వారా మహిళలకు ఉపాధి చూపడంతో పాటు వారికి ఆర్థిక తోడ్పాటు అందించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కరెంటు బిల్లుల చెల్లింపులు, పోస్టల్, బ్యాంకింగ్ సేవలు, పాస్‌పోర్టు స్లాట్ బుకింగ్, రైల్వే, బస్సు, విమాన టికెట్ల బుకింగ్, ఫోన్, వివిధ ధ్రువపత్రాల అందజేత తదితర 250 సేవలు ఈ సెంటర్ల ద్వారా ప్రజలకు అందనున్నాయి. మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలో మున్సిపాలిటీల్లో డిజిటల్ లక్ష్మి పేరిట ఈ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.




తణుకులో పరిశీలిస్తున్న మెప్మా పీడీ

### 244 కామన్ సర్వీస్ సెంటర్లు

జిల్లాలోని మెప్మా పరిధిలోవున్న ఆరు మునిసిపాలిటీల పరిధిలో 244 కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చెయ్యవలసి ఉంది. భీమవరం మునిసిపాల్టీలో 63, ఆకివీడు 15, నరసాపురం 25, పాలకొల్లు 49, తాడేపల్లి గూడెం 53, తణుకు మునిసిపాల్టీలో 39 ఏర్పాటు చెయ్యనున్నారు. ఇప్పటికే 244 మందికి శిక్షణ ఇచ్చారు. 146 మందికి కామన్ సర్వీస్ సెంటర్ ఐడీలు వచ్చాయి. మెప్మా పొదుపు సంఘంలో 10వ తరగతికి పైన చదివి, కంప్యూటర్‌లో పరిజ్ఞానం ఉన్న మహిళ లను సీఎస్సీ సెంటర్ల ఏర్పాటుకు ఎంపిక చేశారు. ఒక్క సెంటర్ రూ.2.92 లక్షలతో కియోస్క్, కంప్యూటర్లు, స్కానర్లు, బిల్లింగ్ మిషన్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తారు. ఇందుకు అవసరమయ్యే రుణాన్ని యూనియన్ బ్యాంకు ద్వారా ఇప్పించడానికి మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సెంటర్ల నిర్వహణ ద్వారా పొదుపు మహిళకు నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా.

### త్వరలో తణుకు మునిసిపాల్టీలో..

డిజి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రయోగత్మకంగా తణుకు మునిసిపాల్టీలోని 1వార్డు ఆడిటోరియం రోడ్డులో ఏర్పాటు చెయ్యనున్నారు. ఇప్పటికే కియోస్క్ ఏర్పాటు చేశారు. సంబంధిత పనులను జిల్లా మెప్మా పీడీ హెబ్సీబా ఇటీవల పరిశీలించారు. ఒక సెంటర్‌కు కావలసిన కంప్యూటర్, స్కానింగ్, బిల్లింగ్ మిషన్, రావడంతో వాటి పరిశీలన చేశారు. నిర్వాహకురాలు ప్రవల్లికతో మాట్లాడారు. ఆమెతోపాటు సీఎంఎం శ్రీనివాస్, ఎల్‌హెచ్‌సీ నానిబాబు ఉన్నారు.

# ఆహార సలహా సంఘాల.. జాడేదీ?



- సమీక్షలు నిర్వహించని అధికారులు
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- మూడేళ్ల నుంచి కమిటీలకు మంగళం



ఏలూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):ఆహార పదార్థాల నాణ్యత, ధరల నియంత్రణలో ప్రజలకు సేవలందించాల్సిన ఆహార సలహా సంఘాలు మచ్చుకైనా కన్పిండం లేదు. దీంతో ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించడంతో పాటు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. డివిజన్, మండల స్థాయి కమిటీలు, జిల్లా స్థాయిలో సలహా సంఘాల కమిటీలను కలెక్టర్లు లీడ్ చేస్తుంటారు. కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లు, ప్రజా సంఘాలు కమిటీలో ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జిల్లా పౌర సరఫరాల శాఖ నిబంధనల మేరకు మండలస్థాయి కమిటీలను నియమిస్తారు.

### సలహా సంఘాల విధులివీ..

కమిటీ సభ్యుల దృష్టికి వచ్చిన ఆహార పదార్థాల శుభ్రత, ధరల నియంత్రణ లేకపోవడం, అధిక ధరలకు విక్రయించడం, కల్తీ వంటి వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఈ నివేదికలు జిల్లా అధికారులకు అందగానే సరైన నిర్ణయం తీసుకుని అమలు చేయడం, ధరలకు అడ్డుకట్ట వేయడం వంటివి చేపడతారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి

### తూతూ మంత్రంగా సమావేశాలు

ఆహార సలహా సంఘాలు రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి కొనసాగాయి. అనంతరం టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని కొనసాగించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో సలహాల సంఘాల ఊసే లేకుండా పోయింది. మండల స్థాయిలో ఆహార సలహా సంఘాలు కనిపించ కుండా పోయాయి. మూడు నెలలకొకసారి మండల స్థాయి సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాలను డివిజన్ స్థాయిలో కమిటీకి తెలపాలి. డివిజన్ సంఘాలు జిల్లా కమిటీలకు నివేదికను పంపించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి కంటి తుడుపుగా సమావేశాలను అధికారులు నిర్వహించేవారు. గత మూడేళ్ల నుంచి ఒక్క సమావేశం జరగలేదు. కూటమి ప్రభుత్వం లోనైనా ఆహార సలహా సంఘాల కమిటీలను ఏర్పాటు చేసి ఆహార భద్రత విషయంలో ప్రజల కు మెరుగైన సేవలందిం చాలని ప్రజలు కోరుతున్నారు.

## అర్చక స్వామీ .. సొమ్ములు పడుతున్నాయా ?

### దూపదీప నైవేద్య పథకంపై ఆరా

భీమవరం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : "దూపదీప నైవేద్యం పథకంలో మీ బ్యాంకు అకౌంట్‌లో సొమ్ములు పడుతున్నాయా..? 1వ తేదీన వస్తున్నాయా..?" అంటూ ఇక నుంచి ఫోన్‌లు రానున్నాయి. అర్చక స్వాములు సంతృప్తిని తెలుసుకోనున్నారు. దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఆలయాల అర్చకులకు ధూప, దీప, నైవేద్యాల పథకం కింద ప్రతీనెల రూ.10 వేలు అందిస్తున్నారు. మొదట్లో రూ.5 వేలతో ఈ పథకం ప్రారంభం కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దానిని 10 వేలకు పెంచారు. జిల్లాలో దేవాదాయ ధర్మదాయ శాఖ ద్వారా వంద దేవాలయాల్లో అర్చకులకు 10 వేలు చొప్పున వేస్తున్నారు. అంతేకాకుండా వేదం చదువుకుని నిరోద్యుగులుగా ఉన్న వేదపండితులకు నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు



అందిస్తున్నారు. ఇప్పటి వరకు దేవదాయ ధర్మదాయ శాఖ ద్వారా అందుకుంటున్న పథకాలకు సం బంధించిన వారి వివరాలను ఇప్పుడు ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌లైన్ చేస్తున్నారు. దేవాలయం, అర్చకుని పేరు, ఆధార్ నెంబరు, ఫోన్ నెంబర్ తదితర వివరాలను భీమవరంలోని దేవదాయ శాఖ కార్యా లయంలో రెండు రోజులుగా నమోదు చేస్తున్నారు. ఈ వివరాలను రియల్‌టైమ్ గవర్నెన్స్ సర్వీస్‌లోకి అనుసంధానం చెయ్యటం ద్వారా ఇక నుంచి పథకంపై సమాచారాన్ని సేకరించి పరిస్థితి తెలుసుకోనున్నారు.

## ఎన్సీఈఆర్టీ సిలబస్‌నే అమలు చేయాలి 7

- 'అపస్' నాయకుల డిమాండ్

## సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

# నిజాయతీ, నిశ్చితాభిప్రాయాలకు పరీక్ష

**సివిల్స్ 2025 నోటిఫికేషన్‌కు సంబంధించి భర్తీ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. మూడోది, చివరిదైన పర్సనాలిటీ టెస్ట్(వ్యక్తిత్వ పరీక్ష) త్వరలో ప్రారంభం కానుంది. ఒక పోస్టుకు రెండున్నర నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను పర్సనాలిటీ టెస్ట్‌కు యూపీఎస్సీ పిలుస్తుంది. ఈ టెస్ట్‌కు కేటాయించిన మార్కులు 275 కాగా అభ్యర్థి తుది విజయం, సర్వీస్ కేటాయింపులో ఇదే కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో పర్సనాలిటీ టెస్ట్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కొన్ని సూచనలు.**

## సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్



అభ్యర్థి మానసిక సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు ఉద్దేశించినదే ఈ పర్సనాలిటీ టెస్ట్. అభ్యర్థి మేధా గుణాలకు తోడు సమకాలీన సామాజికాంశాలపై తనకున్న అభిరుచి, మానసిక అప్రమత్తత, స్పష్టతతో కూడిన తార్కిక విశ్లేషణ, నాయకత్వ లక్షణాలు, నైతిక సమగ్రతను ఇంటర్వ్యూ బోర్డు పరిశీలిస్తుంది. అభ్యర్థి వ్యక్తిత్వమే గీటురాయి. అనుభవజ్ఞులైన సభ్యులతో కూడిన బోర్డు అభ్యర్థిని సమస్త కోణాల్లో సంపూర్ణంగా పరీక్షిస్తుంది. అభ్యర్థి వ్యక్తిగత వివరాలు, తల్లిదండ్రుల నేపథ్యం, విద్యార్హతలు, అలవాట్లు, అభిరుచులు, గతంలో దక్కిన పురస్కారాలు, ఎంపిక చేసుకున్న ఆప్షనల్ సబ్జెక్టు, పనిచేసిన అనుభవం కూడా ఉంటే వృత్తి నేపథ్యం వంటివన్నీ బోర్డు సభ్యులు అడిగే ప్రశ్నల్లో ఉంటాయి. అభ్యర్థులు ఇచ్చే డీటెయిల్డ్ అప్లికేషన్ ఫారం(డీఏఎఫ్) ఆధారంగానే ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థి ఇచ్చిన సమాధానాలనుబట్టి వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేసి మార్కులు నిర్ణయిస్తారు.

### ఇలా సన్నద్ధమైతే.....

- డీఏఎఫ్ 1, డీఏఎఫ్ 2లో పేర్కొన్న ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా అభ్యర్థి విశ్లేషించగలగాలి. సొంత వివరాలు, జిల్లా, రాష్ట్రం, చదువు సహా అన్నింటిపై అభ్యర్థికి తనదైన అవగాహనే కాదు, వాటిని బోర్డు సభ్యులకు స్పష్టంగా చెప్పగలగాలి.
- వేషధారణలో జాగ్రత్త అవసరం. ముఖ్యంగా పురుషులు సూట్‌తో కూడిన ఫార్మల్ దుస్తులు ధరిస్తే మంచిది.
- శరీర భాష(బాడీ లాంగ్వేజ్) సానుకూలంగా ఉండేలా జాగ్రత్త వహించాలి. భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లందరితో చర్చిస్తున్నట్టుగా ప్రవర్తించాలి. నేరుగా వారి కళ్లలోకి చూస్తూ సూటిగా సమాధానాలు ఇవ్వాలి.
- జవాబివ్వడానికి ముందు కొన్ని సెకన్లు ఆలోచించి చెప్పాలి. సమాధానంలో వాస్తవికత అంతకుమించి నిజాయతీ ప్రతిబింబించాలి.
- సమాధానం తెలియని పక్షంలో మర్యాదపూర్వకంగా ఇది నాకు తెలియదు అని చెప్పేయాలి.
- వరుసగా సమాధానాలు తెలియకున్నా తత్తరపడవద్దు. ఇచ్చిన సమాధానాల్లో స్పష్టత ఉంటే చాలు, మంచి మార్కులు సాధించవచ్చు. ఈ విషయాన్ని నమ్మండి.
- అన్నింటికీ మించి ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యం.

### తరచూ అడిచే ప్రశ్నలు

- బోర్డుకు మిమ్మల్ని పరిచయం చేసుకోండి.
- మీరు సివిల్ సర్వీసెస్‌ను ఎందుకు ఎంచుకున్నారు?
- మిమ్మల్ని ప్రభావితం చేసిన వ్యక్తులు, సంఘటనలు ఏవి?
- మీ బలాలు, బలహీనతలు ఏమిటి? మీలో సవరించుకోవాల్సిన లక్షణాలు ఏమిటి?
- ఎంపిక అయ్యాక మీ ప్రాధాన్యాలు ఏమిటి?
- సివిల్ సర్వీసెస్‌లో పెచ్చుమీరిన అవినీతి, ఆశ్రితపక్షపాతంపై మీ అభిప్రాయం ఏమిటి? వాటిని నిరోధించేందుకు మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
- వరకట్నం/ పరువు హత్యలు/ పేదరికం/ బాలకార్మిక వ్యవస్థ/ అత్యాచారాలు/ గృహహింస/ నిరుద్యోగం/ పితృస్వామ్య వ్యవస్థ/ కుల వ్యవస్థ వంటి సామాజిక, ఆర్థిక సమస్యలపై మీ అభిప్రాయం ఏమిటి? వాటిని రూపుమాపేందుకు మీరు సూచించే చర్యలు ఏమిటి?

### వర్తమాన అంశాలపై అవగాహన

కొన్ని వారాలుగా వార్తా సాధనాల్లో ప్రముఖంగా చర్చిస్తున్న వర్తమాన అంశాలపై సమాచారం సేకరించాలి. వాటిపై స్పష్టమైన అభిప్రాయాలను ఏర్పర్చుకోవడమే కాదు, అదే అడిగితే బోర్డు సభ్యులకు స్పష్టంగా చెప్పగలగాలి. కొన్ని మాదిరి ప్రశ్నలు చూద్దాం.

- సమాఖ్యవాదం - ఆర్థిక సమస్యలు - జీఎస్టీ 2.0
- భారత దేశ శాంతి దౌత్యం - గాజా సంక్షోభం, పశ్చిమాసియా విధానం
- ఇంధన పరివర్తన - గ్రీన్ హైడ్రోజన్ - సోలార్ పవర్
- అంతరిక్ష దౌత్యం - భారత దేశానికి సంబంధించి విస్తరిస్తున్న వ్యవస్థ
- భారత విదేశాంగ విధానం - గ్లోబల్ సౌత్‌లో భారత పాత్ర
- కృత్రిమ మేధస్సు - నియంత్రణ
- వాతావరణ మార్పు, హిమాలయాలు - హిమానీనద తిరోగమనం
- ఆర్థిక సంస్కరణలు - కొత్త ఆదాయపన్ను చట్టం - 2025
- ఎర్రకోటకు సమీపంలో ఉగ్రవాద దాడి, అంతర్గత భద్రతకు ఎదురవుతున్న సవాళ్లు
- ఢిల్లీ కాలుష్యం - పంట వ్యర్థాల దహన సంక్షోభం
- ట్రంప్ సుంకాలు, భారత్‌పై వాటి ప్రభావం
- గవర్నర్ పాత్ర - కేంద్ర, రాష్ట్ర సంబంధాలు
- ఇండో పసిఫిక్ ప్రాంతంలో భారత పాత్ర.
- ఆపరేషన్ సింధూర్

## విశ్లేషించాల్సిన అంశాలు

- వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న పాత్ర, ప్రజాకర్షక పథకాలు, ఉచిత హామీలు, ఏకకాల ఎన్నికలు, అభ్యర్థులకు స్టేట్ ఫండింగ్, ఎన్నికల్లో పెరిగిపోతున్న ధనం, కులం, మతానికి ప్రాధాన్యం, సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పులు, న్యాయవ్యవస్థలో అవసరమైన సంస్కరణలు, పార్లమెంట్ ఇటీవల చేసిన చట్టాలు, విపత్తు నిర్వహణలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర, రిజర్వేషన్లు - రాజకీయ రిజర్వేషన్లు, మహిళలకు రిజర్వేషన్ తదితరాలు
- అంతర్జాతీయ అంశాల్లో చైనా దురహంకారపూరిత వైఖరి, పాక్ దుస్సాహసం, క్వాడ్, ఇండో-పసిఫిక్ వ్యూహం, సార్క్, ప్రాంతీయ కూటములు, ఐరాస, ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ వంటి మల్టీ లేటరల్ సంస్థల ప్రాధాన్యం, వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సంబంధాలు
- సామాజిక, ఆర్థిక అంశాల పరిధిలో రైతుల సంక్షేమం కోసం అవసరమైన సంస్కరణలు, ఉద్దేశపూర్వక అప్పు ఎగవేతదారులు, ఎక్స్ట్రాడిక్షన్, ఆర్థిక సర్వే, బడ్జెట్, పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ, బ్యాంకుల విలీనం, జాతీయ విద్యా విధానం - 2020. జాతీయ ఆరోగ్య విధానం
- పర్యావరణ అంశాల కింద గ్లోబల్ వార్మింగ్, క్లయిమేట్ చేంజ్ - కారణాలు, వివిధ రంగాలపై దాని ప్రభావం, గాలి/ నీరు/ నేల కాలుష్యం - పరిష్కార మార్గాలు, బీఎస్ - 6 వాహనాలు.
- తెలుగు రాష్ట్రాల నుంచి హాజరవుతున్న అభ్యర్థులకు స్థానిక అంశాలపై లోతైన అవగాహన ఉండాలి. తెలంగాణ నుంచి హాజరయ్యే అభ్యర్థులు హైదరాబాద్ నగర నేపథ్యం, విశిష్టత, బిర్యానీ, హలీం వంటి సంప్రదాయ వంటకాలు, ముత్యాల నగరంగా హైదరాబాద్‌కు ఉన్న పేరు, సంక్షేమ - అభివృద్ధి పథకాలు, సామాజిక ఆర్థిక సమస్యలపై వివరాలు సేకరించాలి.
- ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులు ప్రత్యేకించి విభజనానంతర సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పెరిగిపోతున్న రెవెన్యూలోటు, తలసరి అప్పు, సంక్షేమ పథకాలు, అమరావతి రాజధాని నిర్మాణం, అభివృద్ధి వికేంద్రీకరణ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, విశాఖకు గూగుల్ డేటా సెంటర్, ప్రజాకర్షక పథకాలు, పొడవైన తీరప్రాంతాల అభివృద్ధికి చేపట్టిన చర్యలు, రాష్ట్రంలోని దర్శనీయ ప్రదేశాలు, వారసత్వ కట్టడాలపై అవగాహన కలిగి ఉండాలి.



- ఎం.బాలలత
సివిల్స్ మెంటార్

## ఏఎఫ్‌క్యాట్



ఎయిర్‌ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ప్రకటనతో నియమించుకున్న అభ్యర్థులకు 2027 జనవరి నుంచి కోర్సు ఆరంభమవుతుంది.

- ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ కింద ఫ్లయింగ్ విభాగంలో ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 34, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు.
- గ్రౌండ్ డ్యూటీ కింద ఏఈ(ఎల్) పీసీ - పురుషులు 3, మహిళలు 3; ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 100, మహిళలకు 9; టెక్నికల్ కింద ఏఈ(ఎం) పురుషులకు 9, మహిళలకు 3; ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 38, మహిళలకు 9 కేటాయించారు.
- గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్) - వెపన్ సిస్టమ్స్ బ్రాంచ్‌లో పురుషులకు 21, మహిళలకు 5, అడ్మినిస్ట్రేషన్‌లో పురుషులకు 48, మహిళలకు 12; లాగ్స్‌లో పురుషులకు 9, మహిళలకు 2, అకౌంట్స్‌లో పురుషులకు 8, మహిళలకు 2, ఎడ్యుకేషన్‌లో పురుషలకు 2, మహిళలకు 2; మీటీయోరాలజీలో పురుషులకు 1, మహిళలకు 2 ప్రత్యేకించారు.
- ఎన్‌సీసీ కింద ఖాళీలను ప్రటించలేదు. అయితే సీడీఎస్ఈలో పదిశాతం, పీసీకి ఏఎఫ్‌క్యాటల్‌లో పదిశాతం సీట్లను ఎస్ఎస్‌సీ వేకెన్సీలుగా ప్రత్యేకించారు.
- అభ్యర్థులు ఫిజిక్స్, మేథ్స్‌తో ఇంటర్‌కు తోడు సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/ బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- వయస్సు ఫ్లయింగ్ బ్రాంచ్‌కు 20-24 సంవత్సరాలు ఉండాలి. గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్/ నాన్ టెక్నికల్) బ్రాంచ్‌కు వయస్సు 20-26 సంవత్సరాల మధ్య ఉండాలి.
- దీనికి ఉద్దేశించిన పరీక్ష వచ్చే ఏడాది అంటే 2026 జనవరి 31న జరుగుతుంది. పరీక్షకు ముందు వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఏఎఫ్ క్యాట్ పరీక్ష కాలవ్యవధి రెండు గంటల కాగా 100 ప్రశ్నలు ఉంటాయి. గరిష్ఠంగా 300 మార్కుల పరీక్ష. ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలను జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ ఇన్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ నుంచి అడగుతారు. జవాబుగా కరెక్ట్‌గా గుర్తిస్తే మూడు మార్కులు ఇస్తారు. తప్పయితే ఒక మార్కు కట్ చేస్తారు. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ప్రాక్టీసింగ్ టెస్ట్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతిలో ఈ పరీక్ష జరుగుతుంది.
- ఏఎఫ్‌క్యాట్‌లో విజయం సాధించిన అభ్యర్థులను తదుపరి టెస్టులకు ఏఎఫ్ఎస్‌బి సెంటర్లలో ఒకదానికి పిలుస్తారు. డెహ్రాడూన్, మైసూర్, గాంధీనగర్, వారణాసి, గువాహతిలో ఇవి ఉన్నాయి.
- అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ 14 లోపు దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు.
- **వెబ్‌సైట్:** https://afcat.edcil.co.in

## కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో పోస్టులు

కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వయంప్రతిపత్తి సంస్థలైన కేంద్రీయ విద్యాలయ సంఘటన(కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)లో దేశవ్యాప్తంగా 14,967 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

ఖాళీలు 14,967

**పోస్టులు:** అసిస్టెంట్ కమిషనర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పీజీ టీచర్స్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, పీఆర్‌టీ(సంగీతం), స్పెషల్ ఎడ్యుకేటర్, లైబ్రేరియన్, కేవీఎస్ నాన్ టీచింగ్ స్టాఫ్, ఎన్‌వీఎస్ నాన్ టీచింగ్ స్టాఫ్

**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, అవసరమైతే నైపుణ్య పరీక్షలు/ ఇంటర్వ్యూలు ఆధారంగా.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 4

**వెబ్‌సైట్:** https://www.cbse.gov.in/, https://kvsangathan.nic.in/ , https://navodaya.gov.in/

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## కొత్త చిత్రం షురూ



తిరువీర్ హీరోగా ఆదివారం ఓ నూతన చిత్రం ప్రారంభమైంది. మహేందర్ కుడుదుల దర్శకత్వంలో పరుచూరి వేంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వివేక్ ఆత్రేయ క్లాప్ ఇచ్చారు. ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదరప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ గౌరవ దర్శకత్వం వహించారు. 'పల్లెటూరి నేపథ్యంలో సాగే అద్భుతమైన ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోంది. వినోదంతో పాటు కదిలించే భావోద్వేగాలు ఉంటాయి' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జగదీశ్ చీకటి.

## ఒకరోజు ముందే విడుదల



రామ్ పోతినేని కథానాయకుడిగా నటించిన 'ఆంధ్రాకింగ్ తాలూకా' చిత్రం విడుదల తేదీ మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈనెల 28న విడుదల కావాల్సి ఉంది. అయితే ఒక రోజు ముందుగా ఈ నెల 27న 'ఆంధ్రాకింగ్ తాలూకా' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఆదివారం ప్రకటించింది. ఈ నెల 18న కర్నూలులో భారీ స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉపేంద్ర కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి మహేశ్‌బాబు పి. దర్శకుడు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. సంగీతం: వివేక్, మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని

## త్రీడీలో అఖండ 2: తాండవం



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2: తాండవం' చిత్రం మేకర్స్ సినీ ప్రియులకు ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. డిసెంబరు 5న విడుదలవుతున్న ఈ సినిమాను 3డీ ఫార్మాట్‌లో తీసుకురానున్నట్లు వెల్లడించారు. సంచలన విజయం సాధించిన 'అఖండ'కు సీక్వెల్‌గా ఇది తెరకెక్కుతోంది. ఆదివారం చిత్ర బృందం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'నందమూరి బాలకృష్ణ అభిమానులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందివ్వాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని త్రీడీలో మీ ముందుకు తెస్తున్నాం. 'భగవద్గీత, రామాయణం, భారతం'.. ఇవి భారతదేశం ఆత్మ. ప్రపంచంలోని మిగతా దేశాల్లో మతం కనిపిస్తుంది. కానీ మన భారత్‌లో మాత్రమే సనాతన ధర్మం కనిపిస్తుంది. ఈ పాయింట్ ఆధారంగానే సినిమాను రూపొందిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులూ ఇష్టపడేలా ఉంటుందీ చిత్రం. ఈ సినిమాను దేశమంతా చూడాలనుకుంటున్నాను. అందుకే ప్రచారాన్ని ముంబై నుంచి మొదలుపెట్టాం' అని చెప్పారు. 'ఈ చిత్రానికి ఉన్న కథా పరిధిని దృష్టిలో పెట్టుకొని త్రీడీలో తీసుకువస్తున్నాం. విజువల్స్ అదిరిపోనున్నాయి' అని గోపి ఆచంట చెప్పారు. బాలకృష్ణ కూతురు తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఆది పినిశెట్టి, సంయుక్త, హర్షాలి మల్హోత్రా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



## అలా చేస్తున్నది నేను కాదు

- అదితి రావు హైదరి

తన పేరు, ఫొటో ఉపయోగిస్తూ ఓ వ్యక్తి వాట్సాప్‌లో ఫేక్ ఖాతాను వాడుతున్నాడని, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని నటి అదితిరావు హైదరి సూచించారు. 'నా దృష్టికి వచ్చిన ఓ ముఖ్యమైన విషయాన్ని మీతో షేర్ చేసి, మీ అందర్నీ అప్రమత్తం చేయాలనుకుంటున్నాను. నా పేరుతో ఓ వ్యక్తి ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు సందేశాలు పంపిస్తున్నాడని తెలిసింది. ఆ పని చేస్తున్నది నేను కాదు. ఫొటోషూట్స్ కోసం నేను వ్యక్తిగత ఫోన్ నెంబరుతో ఎవ్వరినీ సంప్రదించను. నా టీమ్ ద్వారానే నేను ఫొటోగ్రాఫర్స్‌ను సంప్రదిస్తాను. ఎవరైనా నా పేరుతో మీకు ఇలాంటి సందేశాలు పంపితే, వెంటనే మా టీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు తెలియజేయండి' అని విజ్ఞప్తి చేశారు.

## నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పాంచ్‌మినార్'. రాశీ సింగ్ హీరోయిన్. ఎంఎస్ఎం రెడ్డి నిర్మించారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది. అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి దర్శకుడు తెరకెక్కించారు. నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంటుంది' అని చెప్పారు. రామ్ మాట్లాడుతూ 'రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథ ఇది. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని అన్నారు. కుటుంబంతో కలసి చూసేలా మా సినిమా ఉంటుంది, నా పాత్ర విభిన్నంగా ఉంటుంది' అని రాశీసింగ్ చెప్పారు. మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కించాం అని నిర్మాత తెలిపారు.

## ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథతో వస్తున్నాం

- సాయిలు కంపాటి



'పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పీరియాడిక్ ప్రేమకథా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమా చేస్తున్నాం. ప్రేమకథకు సామాజిక అంశాలను కలిపిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని సాయిలు కంపాటి అన్నారు. ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. అఖిల్, తేజస్విని జంటగా నటించారు. 'రాజు వెడ్స్ రాంబాయి'. వేణు ఊడుగుల, రాహుల్ మోపీదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకుడు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయిలు కంపాటి మీడియాతో మాట్లాడారు.

- వేణు ఊడుగుల, శ్రీకాంత్ అడ్డాల దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశాను. మనదైన నేటివిటీ కనిపించేలా రాసుకున్న కథ ఇది. వేణు అన్నకు కథ నచ్చి దర్శకుడిగా అవకాశం ఇచ్చారు.
- నా చిన్నతనంలో మా ప్రాంతంలో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో కథ రాసుకున్నాను. స్నేహం, వైరం ప్రధానాంశాలుగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకుంది. ఈ కథలో ప్రేమికులకు ఏం జరిగిందనేది మాత్రం తెరపైనే చూడాలి. వరంగల్‌లో షూట్ చేశాం. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్.

## అందరూ మెచ్చేలా...



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. బేబీ చైత్రశ్రీ బాదర్ల, మాస్టర్ యవ్వాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మీ బాదర్ల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన పోస్టర్లు, టీజర్లు ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'ఏమైపోతుందో' అంటూ సాగే గీతాన్ని గీత రచయిత చంద్రబోస్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పాట చాలా బాగుంది. అందరూ మెచ్చేలా చిత్రం ఉండబోతోంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. శ్రీహర్ష ఈమని రాసిన ఈ పాటను పవన్‌చ శృతిక సముద్రాల ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు.

## పేరు తెచ్చే పాత్రలు చేస్తున్నా



- కామాక్షి భాస్కర్ల

'విజయ్ సేతుపతి, సుహాస్ లాంటి నటులు హీరోలుగా నటిస్తూనే ఇతర పాత్రల్లోనూ మెప్పిస్తున్నారు. నేను కూడా ఆ తరహాలో ఎందుకు ప్రయత్నించకూడదు అనుకున్నాను. అందుకే కథానాయికగా చేస్తూనే, నటిగా పేరు తెచ్చే సహాయ పాత్రలనూ చేస్తున్నాను' అని కామాక్షి భాస్కర్ల అన్నారు. అల్లరి నరేశ్, కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన చిత్రం '12 ఏ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. దర్శకుడు డాక్టర్ అనిల్ విశ్వనాథ్ కథను అందించడంతో పాటు దర్శకత్వ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కామాక్షి భాస్కర్ల సినిమా విశేషాలను పంచుకున్నారు. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో ఈ సినిమా రూపొందింది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఇందులో నా పాత్ర పేరు ఆరాధన. కథను మలుపు తిప్పే పాత్ర. ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా దర్శకుడు తీర్చిదిద్దారు. ప్రేమవల్ల ఆమె జీవితం ఎలాంటి మలుపు తీసుకుందనేది ఆసక్తికరంగా ఉంటుంది. అలాగే రైల్వే కాలనీలో జరిగిన అనూహ్య సంఘటనలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయనేది ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి.

## గ్రామీణ నేపథ్యంలో



పల్లెల్లో ఉండే అనుబంధాలు, ఆప్యాయతల కలబోతగా సాగే చిత్రం 'మా రాముడు అందరివాడు'. సీనియర్ నటుడు సుమన్ ప్రధాన పాత్ర పోషించారు. శ్రీరామ్, స్వాతి జంటగా నటించారు. యద్దనపూడి మైఖేల్ దర్శకత్వంలో అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు, వాణిజ్యాంశాలతో నిండిన భారీ యాక్షన్ చిత్రమిది. పల్లె వాతావరణంలో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరించేవిధంగా ఉంటుంది' అని అన్నారు. మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిదని నిర్మాతలు తెలిపారు.

## ద్విభాషా చిత్రంలో జాబిలి



కోర్ట్ చిత్రంలో జాబిలి పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయిక శ్రీదేవి అపల్లా. తమిళ నటుడు ఏగన్, 'మిన్నల్ మురళీ' ఫేమ్ ఫెమినా జార్జ్‌కు జోడీగా ఆమె నటిస్తున్నారు. తెలుగు తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాను ఇటీవలె ప్రారంభించారు. యువరాజ్ చిన్నసామి దర్శకత్వంలో 'జో' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న విజన్ సినిమాస్ పతాకంపై డాక్టర్ డీ అరుళనందు, మాథ్యూయో అరుళనందు నిర్మిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు.

# అమ్మా.. గుబ్బల మంగమ్మ


గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తులు

బుట్టాయగూడెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ అడవి బిడ్డల వనదేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అనేక ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనాలకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. దర్శనాలు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అమ్మవారి దర్శనాలకు వస్తున్న భక్తుల సంఖ్య క్రమేపి పెరుగుతుంది. మహిమ గల అమ్మకోసం భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. భక్తుల కోసం ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## లారీ ఎక్కిన సూరీడు

తొలిపొద్దు పొడిచింది.. తలుపుతీయవా ప్రభూ అంటూ ఓ సినీ గేయ రచయిత కలం నుంచి జాలువారిన కవితను స్పృశిస్తూ ఎర్రని సూర్యుడు తెల్లటి మంచును చీల్చుకుంటూ వస్తుంటే ఆ సుందర దృశ్యం కన్నుల పండువగా కనిపిస్తుంది. అలాంటి దృశ్యం తాడేపల్లిగూడెంలోని హైవే వద్ద ఎర్రని సూరీడు తెల్లని మంచును చీల్చుకుంటూ వస్తున్నట్టు వున్న ఆ దృశ్యాన్ని ఫొటోలో బంధిస్తుండగా మధ్యలో లోడు లారీపై సూరీడు ఎక్కినట్టు కెమేరాకు చిక్కింది. మరోచోట విద్యుత్ స్తంభంపైకి ఎక్కి విద్యుత్ లైటా అనిపించేట్టుగా కనిపించిన దృశ్యాలు ఇవి.

- తాడేపల్లిగూడెం రూరల్


విద్యుత్ దీపంగా మారిన ఎర్రటి సూరీడు

# గోవిందా.. గోవింద..


ద్వారకాతిరుమల ఆలయ ప్రాంగణంలో భక్తులు

ద్వారకాతిరుమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో చివరి ఆదివారం కావడంతో చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండింది. 15 వేల మందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో రద్దీగా మారింది. శ్రీవారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం నుంచి రద్దీ కాస్త తగ్గుము ఖం పట్టింది. ఆర్టీసీ బస్సులు యాత్రికులతో కిక్కిరిశాయి.

## ఘనంగా రాష్ట్రస్థాయి యాదవ కార్తీక వనసమారాధన


పల్లా శ్రీనివాసరావును సన్మానిస్తున్న యాదవ్ సంఘం నాయకులు

దెందులూరు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, అన్ని రంగాలతోపాటు వ్యాపార రంగాల్లోనూ యాదవ్‌లు ముందుండాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గోపన్నపాలెంలోని పీఈటీ కాలేజీ ఆవరణలో యాదవ సంఘం రాష్ట్రస్థాయి కార్తీక వనసమారాధన జిల్లా యాదవ్ సంఘం అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య యాదవ్, ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి విచ్చేసి మాట్లాడారు. యువ సమితి నాయకుడు కాట్రు బాలు, ఏపీ యాదవ్ రాష్ట్ర డైరెక్టర్ పెనుబోయిన మహేష్, శీలం వెంకటేశ్వరావు, కారుమూరి సునీల్, తలకొండ జమలయ్య, నున్న లక్ష్మణ్, రాష్ట్ర సెక్రటరీ క్రరేటితో పాటు వేలాదిమంది పాల్గొన్నారు.

## రోగ నిర్ధారణ, చికిత్సలో 'ఏఐ'తో ఆధునిక సేవలు


సదస్సులో ప్రొఫెసర్లు, సీనియర్ సైంటిస్టులు, అధ్యాపకులు

ఏలూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోగ నిర్ధారణ, చికిత్స ప్రణాళిక, ఆసుపత్రి నిర్వహణ, తదితర అంశాల్లో కృత్రిమ మేథ(ఏఐ) వైద్యులకు సహాయకరంగా ఉంటుందని పలువురు సీనియర్ సైంటిస్టులు, ప్రొఫెసర్లు అన్నారు. ఏలూరు సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు 'ఔషధ రంగంలో ఏఐ పాత్ర' జాతీయ సదస్సు జరిగింది. సదస్సులో చర్చించిన ముఖ్యవిషయాలు, పరిశోధనలు, తీర్మానాలపై ఆదివారం కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు(నానాజీ), ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రబాబు ఓ ప్రకటనలో వివరించారు. రోగులకు సేవలను ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ మరింత మెరుగుపరుస్తుందన్నారు. సమకాలీన పరిశోధనల్లో ఏఐ వాస్తవ వినియోగాలపై చర్చించామన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఫార్మసీ కళాశాలల నుంచి 700 మంది విద్యార్థులు హాజరయ్యారని, పోస్టర్, ఓరల్ అండ్ క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మాకాలేజీ ప్రొఫెసర్ కె.ఈశ్వరకుమార్, ఐఎంఏ చైర్మన్ డాక్టర్ డి.బసవరాజు, ఐసీఎంఆర్ సైంటిస్టు కె.వి.జగదీష్, డాక్టర్ మురళీచందర్, సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీలు మనోజ్‌కుమార్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

## 'రైతుల కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ లక్ష్యం'


వడలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని

ఆచంట/పెనుగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆచంట మండలం ఆచంట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పెనుగొండ మండలం వడలి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. రైతుల సమస్యలను తెలుసుకుని నివృత్తి కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు. ధాన్యం తేమశాతం రైతు సేవా కేంద్రం వద్ద రైస్ మిల్లర్ వద్ద తేడాలు ఉండకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మి, అగ్రికల్చర్ ఏవో స్పందన, తహసీల్దార్ జి.అనితకుమారి, ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


అటజని కాంచెన్ చిత్రం ట్రైలర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

## దర్శకుడు 'రాహుల్ రాయ్'కు అభినందనలు

తణుకు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణానికి చెందిన యువ దర్శకుడు రాహుల్ రాయ్ అడబాల స్వీయ రచనలో దర్శకత్వం వహించిన 'అటజని కాంచెన్' చిత్రం ఘనవిజయం సాధించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకాంక్షించారు. ఆదివారం సాయంత్రం టీడీపీ క్యాంపు కార్యాలయంలో చిత్రం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. తణుకు ప్రాంతానికి చెందిన అతడు భవిష్యత్‌లో మరిన్ని చిత్రాలు రుపొందించి మంచిపేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాహుల్ ఎమ్మెల్యే ఆరిమిల్లిని అభినందించారు. కార్యక్రమంలో కానూరి రాంబాబు, జహంగీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.


## ఏలూరులో 'సంతాన ప్రాప్తిరస్తు' యూనిట్ సందడి


విలేకరులతో మాట్లాడుతున్న హీరో, హీరోయిన్

ఏలూరురూరల్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) : విక్రాంత్, చాందినీ చౌదరి జోడిగా నటించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' సంజీవ్‌రెడ్డి దర్శకత్వం వహించారు. మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై అన్ని థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతుంది. విజయ యాత్రలో విభాగంగా సినిమా యూనిట్ సభ్యులు, ఆదివారం సినిమా ప్రదర్శిస్తున్న ఏలూరు విజయలక్ష్మి వి-మాక్స్ థియేటర్‌లో మార్నింగ్‌షోకు సందడి చేశారు. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. హీరో విక్రాంత్ మాట్లాడుతూ రివ్యూస్ పాజిటివ్‌గా రావడం సంతోషమనిపించిందని, సినిమాకు వస్తున్న పాజిటివ్ ఫీడ్ బ్యాక్ చూసి ఏడాదిన్నరగా పడిన కష్టం మర్చిపోయామన్నారు. హీరోయిన్ చాందినీచౌదరి మాట్లాడుతూ ఈ సినిమా క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అన్నారు. సినిమా హిట్ చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్సీఈఆర్టీ సిలబస్‌నే రాష్ట్రంలో అమలు చేయాలి

» 'అపస్' నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

ఏలూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :జాతీయ విద్యావిధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించినందున ఆ మేరకు రాష్ట్రంలో అన్ని తరగతులకు కేంద్ర (ఎన్సీఈఆర్టీ) సిలబస్‌నే అమలు చేయాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరులో ఏపీ ఉపాధ్యాయ సంఘం(అపస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేస్తోన్న బోధనేతర కార్యక్రమాలను, యాప్‌లను ఉపసంహరించు కోవాలని కోరారు. అఖిల భారతీయ ఉపా ధ్యాయ సంఘం జాతీయ కార్యదర్శి జి.లక్షణ్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో జాతీయభావాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ మాట్లాడుతూ పాఠశాల విద్యలో ప్రస్తుతం జరుగుతోన్న సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ప్రశ్నపత్రాలు ఒకొక్కటి 8 నుంచి 10 పేజీల వరకు ఉన్నాయని, వీటిని పిల్లలు చదివి అర్థంచేసుకోలేని పరిస్థితులు నెలకొన్నందున గతంలో మాదిరిగా ప్రశ్నపత్రాలను రెండు పేజీలకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విచ్చేసిన సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ టెట్ పరీక్షనుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలని కోరారు. అపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజకుమార్, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సీహెచ్.ఎతీష్‌కుమార్, ఆర్.శ్యాంసుందర్, జి.గణపతి, మహిళావిభాగం నాయకులు కల్యాణి, రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్

## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల విజేత 'విశాఖపట్నం'

లింగపాలెం, నవంబరు16(ఆంధ్రజ్యోతి):స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల విజేత విశాఖపట్నం జట్టు నిలిచాయని స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో రెండు రోజులుగా జరుగుతున్న అండర్-19 రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు గెలిచింది. బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు గెలిచింది. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమెల్యే సొంగా రోషన్‌కుమార్ ట్రోఫీలు, బహుమతులు అందించి అభినందించారు. నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు

## సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు,నవంబరు 16(ఆంధ్రజ్యోతి):వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ విజయవాడ డైరెక్టర్ ఆదేశాల మేరకు యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల ,ఆదాయ ధ్రువీకరణపత్రాలు, ఆధార్ జిరాక్సు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈనెల 17 నుంచి 25వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు బీసీ స్టడీ సర్కిల్ వెన్నవల్లివారిపేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్కూల్, ఏలూరు అడ్రస్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది, అర్హత సాధించిన పదో తేదీ నుంచి గొల్లపూడిలో శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత శిక్షణతో బస, భోజన వసతి ఉంటుందన్నారు. వివరాలకు 86861 80018, 90302 11920 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ఇన్విటేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేత నవ్యసాహితి


ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతలు

ఏలూరు క్రైం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): ఇన్విటేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతగా నవ్యసాహితి నిలిచింది. లిటిల్‌మాస్టర్స్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఏలూరు, ఎన్ఆర్‌పేట సిటీ కంప్యూటర్స్‌లో ఆదివారం లిటిల్ మాస్టర్స్ ఇన్విటేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంటులో 40మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో విజయవాడకు చెందిన పెద్ది నవ్యసాహితి ప్రథమ స్థానం, నవదీప్ ద్వితీయ(ఏలూరు), అక్షిత్ తృతీయ(ఏలూరు), అట్టా అక్షయ నాలుగో స్థానం(విజయవాడ), పెద్ది జైతేజ ఐదోస్థానం (విజయవాడ), శౌర్యసాయిసూర్య ఆరో స్థానం(ఏలూరు), శ్రీనివాస్ ఏడోస్థానం(ఏలూరు) సాధించారు. బాలికల అండర్-5 విభాగంలో యోధిన్ ఎనిమిదో స్థానం(ఏలూరు) , అండర్-7లో సాత్విక్(ఏలూరు), అండర్-9లో అద్వయిత్ బహుమతులు సాధించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయవాడ రైల్వే చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ పెద్ది సుధీర్, లిటిల్ మాస్టర్స్ చెస్ అకాడమి డైరెక్టర్ డి.లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ హైమా, సీనియర్ క్రీడాకారుడు వైఎస్ సూర్యనారాయణ, చీఫ్ ఆర్బిటర్‌గా కావూరి కృష్ణకుమారి బహుమతులు అందజేశారు.


విగ్రహ ఆవిష్కరణలో మాట్లాడుతున్న మంత్రి జనార్దన్ రెడ్డి

## నేటి యువతకు 'ఉయ్యాలవాడ' స్ఫూర్తిదాయకం

» ఆర్అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి

పెనుమంట్ర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవ వీరు డు ఉయ్యాల వాడ నరసింహా రెడ్డి విగ్రహా విష్కరణ నేటి యువతకు స్ఫూర్తి దాయకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. పెనుమంట్ర మండలం మార్టేరులో ఆదివారం ఉదయం నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి వందేళ్ల పూర్వమే బ్రిటీష్ వారిపై అలుపెరగని పోరాటం చేసిన యోధుడు ఉయ్యాలవాడ అన్నారు. జిల్లా రెడ్డి సేవా సంఘం నాయకులు కేవీవీ సత్యనారాయణరెడ్డి, వెలగల బుల్లిరామిరెడ్డి, కోనాల కోదండచంద్ర శేఖరరెడ్డి, తేతలి రాజారెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ్‌రెడ్డి, నల్లిమిల్లి వివేకానందరెడ్డి పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు, టీడీపీ నాయకులు

## రాష్ట్రానికి క్యూకడుతున్న పరిశ్రమలు

» జీర్ణించుకోలేకపోతున్న వైఎస్ జగన్ : ఆప్కాబ్ చైర్మన్ గన్ని

గణపవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పరిశ్రమల నిర్మాణానికి పారిశ్రామికవేత్తలు క్యూకడుతుంటే వైఎస్ జగన్ జీర్ణించుకోలే కపోతున్నారని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు విమర్శించారు. ఆదివారం గణపవరం మండలం అర్థవరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏపీ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖపట్నంలో పారిశ్రామికవేత్తలతో జరిగిన ఒప్పందం రాష్ట్రానికి ఒక వరం అన్నారు. రాష్ట్రంలోని ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి విధ్వంసం సృష్టించి మరో 35 ఏళ్లపాటు వెనక్కి తీసుకువెళ్లిన ఘనత దక్కిందన్నారు. రాష్ట్రంలో గ్లోబల్ దృష్టిని కేంద్రీకరించి, పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు మరోసారి తన ప్రావీణ్యాన్ని నిరూపించారని కొనియాడారు. రాయసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కంపెనీలకు గైడ్ చేశారన్నారు. సమావేశంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, భీమడోలు, నిడమర్రు మండలాల టీడీపీ అధ్యక్షుడు కరణం పెద్దిరాజు, ముత్యాల స్వామి, గణపవరం సొసైటీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, అడ్డాడ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.




భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో పూర్ణాహుతి దృశ్యం.. మంచు పర్వతాలలో సోమేశ్వరుడు.. అలంకరణలో పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి..

## ముగిసిన మావుళ్లమ్మ మండల దీక్షలు

భీమవరంటౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ అమ్మవారి మండలదీక్షలు ఆదివారం భక్తులు అమ్మవారి నామస్మరణల మధ్య వైభవంగా ముగిసింది. ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మీనగేష్ పర్యవేక్షణంలో తెల్లవారుజాము ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో అమ్మవారి ఇరు ముడులను ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. ముందుగా విఘ్నేశ్వరపూజ చేసి ఇరుముడులను కట్టారు. అనంతరం మంగళవాయిద్యాలతో గ్రామ ప్రదిక్షణ నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హోమగుండాల్లో చండీహోమం నిర్వహించగా మరో హోమగుండంలో పూజచేసి పూర్ణాహుతిని పూర్తి చేశారు. అనంతరం మాలధారులు అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులను సమర్పించుకున్నారు. హోమగుండంలో ద్రవ్యాలను వేసి దీక్షలను విరమించారు.

### మంచు కొండల్లో సోమేశ్వరుడు..

భీమవరంటౌన్ : కార్తీక మాసం సందర్భంగా సోమేశ్వరస్వామిని మంచు కొండల్లో సోమేశ్వరుడును అలంకరణ చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

### క్షీరా రామంలో యాత్రికుల సందడి

పాలకల్లుఅర్బన్,నవంబరు16(ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా పంచారామ క్షేత్రం క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పంచారామ క్షేత్రాల పేరుతో వచ్చే యాత్రికులతో ఆలయం కిటకిటలాడింది. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 8,500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. పలు రాష్ట్రాల నుంచి పంచారామ క్షేత్రాల పేరుతో సుమారు 20 వేల మంది వరకు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయవర్గాల సమాచారం. కార్యక్రమాల్లో పాలకవర్గ చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరిండెంటెంట్ వాసు, దేవదాయశాఖ ఈవోలు, సిబ్బంది, వలంటీర్లు సేవలందించారు.

● స్వామివారికి 15వ తేదీన అభిషేకం టికెట్ల అమ్మకం ద్వారా 82,407, లడ్డూ విక్రయాల ద్వారా రూ.1110, మొత్తం రూ.83,517 ఆదాయం వచ్చినట్టు ఈవో తెలిపారు.

పోతునూరు సొసైటీలో అక్రమాలు

## మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రధాన అనుచరుడు నాగేంద్ర వరప్రసాద్ అరెస్ట్


పోలీసుల అదుపులో ఉన్న నాగేంద్రవరప్రసాద్

ఏలూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రధాన అనుచరుడు, పోతునూరు భోగేశ్వరస్వామి సహకార సొసైటీ మాజీ అధ్యక్షుడు దూళిపాళ నాగేంద్ర వరప్రసాద్ (బజ్జీ)ను దెందులూరు పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సొసైటీలో భారీగా నిధుల స్వాహా వెలుగుచూసింది. 2022లో ఈ సొసైటీలో రూ.కోటి 54 లక్షలు అక్రమాలు వెలుగుచూశాయి. దీనిపై 51వ విచారణను సహకారశాఖ అధికారులు చేపట్టారు. అప్పటి కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ చర్యలకు ఆదేశించారు. ఆడిట్‌లోను పలు సంచలనాలు బయటపడ్డాయి. ఇప్పటికే సొసైటీ పరిధిలో డిపాజిట్‌దారులకు సకాలంలో మొత్తాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై డివిజన్ కో-ఆపరేటివ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదుతో పలు క్రిమినల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన దెందులూరు పోలీసులు ఆదివారం రాత్రి బజ్జీని అరెస్ట్ చేశారు. ఈ అరెస్టుతో మిగిలిన అక్రమాలు జరిగిన సొసైటీల్లోనూ త్వరలోనే వేగవంతంగా చర్యలుంటాయన్న సంకేతాలు ఇచ్చినట్టయింది. సహకార వారోత్సవాలు జరుగుతున్న తరుణంలో కీలకమైన సొసైటీ అక్రమాలపై అధికారులు, పోలీస్ యంత్రాంగం చర్యలు ఉపక్రమించడం చర్చనీయాంశంగా మారింది.

# దిగిరాని కూరగాయలు

» మహారాష్ట్ర నుంచి నాసిరకం ఉల్లి
» క్వింటా రూ.1,300 నుంచి 1,800 మధ్యనే.

కొద్దిగా తగ్గిన వంకాయ ధర



తాడేపల్లిగూడెం మార్కెట్లో కూరగాయలు

తాడేపల్లిగూడెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో కూరగాయల ధరలు దిగిరానంటున్నాయి. గత మూడు వారాలుగా కూరగాయలు ధరలు భగ్గుమంటున్నాయి. కార్తీక మాసంతో పాటు, వాతావరణంలో వచ్చిన మార్పుతో దిగుబడి తగ్గడం వంటి కారణాలతో కూరగాయల ధరలు తగ్గడం లేదు. వంకాయ, కంద ధర మాత్రమే కొద్దిగా తగ్గింది. మిగిలిన కూరగాయల ధరలు తగ్గడం లేదు. బీరకాలు, బెండకాయలు, దొండకాయలు కిలో రూ.80కు విక్రయిస్తున్నారు. చిక్కుడు రూ.120, కాకరకాయ రూ.60, టమాటా లు రూ.50, క్యాప్సికం 120, వంకాయలు రూ.100, కంద రూ.60 పచ్చిమర్చి రూ.50, బీట్‌రూట్ రూ.80, క్యారెట్ రూ.80, మునగకా డలు రెండు రూ.25, అరటికాయలు రెండు రూ.20 చొప్పున విక్రయించారు.

### మహారాష్ట్ర నుంచి 210 టన్నుల ఉల్లి..

తాడేపల్లిగూడెంలోని ఆదివారం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి 7 లారీలో సుమారు 210 టన్నుల ఉల్లి వచ్చింది. ఈ ఉల్లిని హోల్‌సేల్‌గా క్వింటా రూ.1300 నుంచి 1800 మధ్య విక్రయించారు. నాసిరకంగా ఉండడంతోపాటు నాణ్యత తక్కువగా ఉండడంతో ధర అంతగా రాలేదని వ్యాపారులు చెబుతున్నారు. మంచి నాణ్యత ఉన్న మహారాష్ట్ర ఉల్లికి క్వింటా రూ.1800 నుంచి రూ.2300 వరకు గత వారం కొనుగోలు చేసినట్టు వ్యాపారులు చెబుతున్నారు. ఇక కడప, కర్నూలు నుంచి ఉల్లి రావడం పూర్తిగా ఆగిపోయింది. ఇక రిటైల్‌గా నాణ్యమైన ఉల్లి రూ.100కు 5కిలోలు, మధ్యస్త రకం ఉల్లి రూ.100కు 5కిలోలు, నాసిరకం ఉల్లి 100కు 6కిలోల వంతున విక్రయించారు.

### నిలకడగా చికెన్ ధరలు



చికెన్ ధరలు స్థిరంగా ఉన్నాయి. కార్తీక మాసంలో చికెన్ వినియోగం తక్కువగా ఉంటుంది. ఇదే అదునుగా చికెన్ సరఫరా చేసే కార్పొరేట్ సంస్థలు సరఫరా తగ్గించాయి. ఈమేరకు గత మూడు వారాలుగా చికెన్ ధర స్థిరంగా ఉన్నాయి. కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.220, విత్‌స్కిన్ చికెన్ రూ.200కు విక్రయిస్తున్నారు.

క్రైం సమాచారం

## హాస్టల్లో విద్యార్థి ఆత్మహత్య

నూజివీడు టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నూజివీడులో జరిగింది. నూజివీడులోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం దమ్మపేట మండలం పట్వారిగూడెంకు చెందిన చందన్ కుమార్ (19) తాను చదువుతున్న కళాశాల హాస్టల్లో శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం వచ్చిన సిబ్బంది చందన్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్న విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని సమాచారం.

## గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఏలూరు క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):ఒక గుర్తు తెలియని వ్యక్తి ఐరన్ షాపు ముందు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం అందింది. ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 55 ఏళ్ల వయస్సు ఉంటుంది. ఏ కారణము చేత మృతి చెందాడో తెలియలేదు. అనారోగ్య కారణమా లేదా మరే ఇతర కారణమో? తెలియరాలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు సీఐ 94407 96606కు సమాచారం ఇవ్వాలన్నారు.

## పెనుగొండ - చెరుకువాడ బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గం

పెనుగొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పెనుగొండలోని చెరుకువాడ బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. కార్తీక వన సమారాధనలో భాగంగా జరిగిన సమావేశంలో కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. అధ్యక్షుడిగా జోస్యుల శ్రీరామ్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా శిష్ట శేషగిరి మణికంఠ శర్మ, కోశాధికారిగా కాశీభట్ల పణి, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

## సంచార శకటంలో వైద్య సేవలు

తణుకు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సంచార శకటం ద్వారా డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆదివారం వైద్య సేవలు అందించారు. తణుకు పరిసర ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురికి ఉచితంగా సేవలందించారు. సంఘ సభ్యులు రెడ్డి అప్పారావు ఆర్థిక సాయంతో మందులు అందజేసారు. కార్యక్రమంలో కోశాధికారి అర్థి భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


పాలకొల్లు క్షత్రియ పరిషత్‌లో దాతలకు నిమ్మల సత్కారం


తణుకులో విజేతలకు బహుమతులు ఇస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి



ఆకివీడులో గౌడ, శెట్టిబలిజ కార్తీక వన సమారాధనలో రాజ్యసభ సభ్యుడు పాకా, కాపు వనసమారాధనలో మహిళలు

# ఐక్యతకు ప్రతీక కార్తీక వన సమారాధన

ఆకివీడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీక వన సమారాధనలు ఐక్యతకు ప్రతీక అని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. కాపు యువజన సంఘం, గౌడ, శెట్టిబలిజ సంక్షేమ సంఘం, తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరు చోట్ల ఆదివారం కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. మెహందీ, మ్యూజికల్ ఆర్కెస్ట్రా, లక్కీడీప్, ఆటలతో సరదాగా గడిపారు. చుండూరి వెంకట్రావు, వానపల్లి బాబూరావు, మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, మోటుపల్లి గంగాధరరావు, కట్టా రవి, ఎంవీఎస్ నాగమణి, గంధం ఉమా, నౌకట్ల రామారావు, కేశిరెడ్డి మురళీ, పిల్లా బాబులు, చిరంజీవి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**తణుకు:** నియోజకవర్గంలోని కమ్మ సేవా సంఘం, కళింగ సేవా సంఘం, కిళ్లీ బీడీ వర్తక సంఘం, నాయీబ్రాహ్మణ, కార్పెంటర్లు, సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరు చోట్ల నిర్వహించిన కార్తీక వన సమారాధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. శివాలయాల్లో శివార్చనలు, ఉపవాసాలతో పాటు వన భోజనాలతో అందరిలో సోదరభావం కలుగుతుందన్నారు. ఆటల పోటీలులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా సంఘాలు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, మండల శెట్టి బలిజ, గౌడ సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. మొగల్తూరు కోట వద్ద జంపా వీరాస్వామి కుటుంబ సభ్యులు కులాలకు అతీతంగా వన సమారాధన నిర్వహించారు. మొగల్తూరు గౌడ, శెట్టిబలిజ వన సమారాధనలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను సన్మానించారు.

**నరసాపురం రూరల్:** పట్టణ, మండలంలో ఆదివారం వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు జరిగాయి. పట్టణంలో ఆర్య వైశ్యుల వన సమారాధన, రుస్తుంబాదా, లక్ష్మణేశ్వరంలో శెట్టి బలిజ, గౌడ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్సీ కవురు శ్రీను లక్ష్మణేశ్వరంలో జరుగుతున్న వనసమారాధనలో పాల్గొన్నారు. కుల సమారాధనలు ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు.

**పోడూరు:** గుమ్మలూరులో జరిగిన శెట్టిబలిజ వన సమారాధన కార్యక్రమంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ పాల్గొన్నారు. ఐక్యతకు వన సమారాధనలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, గుడాల గోపి శెట్టిబలిజ పెద్దలను సన్మానించారు. బొంతు ఆదినారాయణ, దొంగ సూర్యప్రసాదు, పితాని సూర్యనారాయణ, కుక్కల దుర్గారావు, కడలి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**తణుకు రూరల్:** మండలంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. వేల్పూరు, తేతలి గ్రామాల్లో కాపు, బలిజ, ఒంటరి, తెలగ సామాజిక వర్గాల వారు వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, చీర్ల రాధయ్య, కారుమూరి సునీల్, రుద్ర ధనరాజు, నాయకులు పాల్గొన్నారు.

**పాలకొల్లు అర్బన్:** పట్టణంలో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. కార్తీక దామోదర పూజలు, ఉసిరి చెట్టు పూజలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చిన్న గోపురం వీధిలో ఆర్యవైశ్య సంఘం, ఎల్‌ఆర్‌పేటలో క్షత్రియ సంక్షేమ పరిషత్, ఏఎంసీ ఆవరణలో యాదవ సంఘం, అడబాల గార్డెన్స్‌లో తూర్పు కాపు సంక్షేమ సంఘం, పద్మశాలి యువజన సంఘం, తెలికుల సంఘం, కాపు సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధనలు జరిగాయి. పలు సంఘాల వన సమారాధనల్లో మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, మేకా శేషుబాబు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం అర్బన్:** పట్టణంలోని పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో తాడేపల్లిగూడెం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. కుటుంబాలతో హాజరై ఆనందంగా గడిపారు. జబర్దస్త్ రైజింగ్ రాజు టీం సందడి చేసింది. భవన కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఏర్పాట్లను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

**యలమంచిలి:** కాకతీయ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గోదావరి తీరాన కార్తీక వన సమారాధన నిర్వహించారు. వివిధ పోటీల్లో మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గోదావరి ఒడ్డున ఏర్పాటుచేసిన వివిధ ఆకృతుల వద్ద, బోటింగ్, హార్స్ రైడింగ్‌ల వద్ద మహిళలు, యువత సెల్ఫీలతో సందడి చేశారు. తాళ్లూరి శ్రీనివాస్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, బొప్పన రాంబాబు, బొబ్బా రాజేష్, చిలుకూరి సాయి, బొప్పన శివ, గ్రామపెద్దలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**భీమవరం టౌన్:** ఉమా సోమేశ్వర గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో భీమవరం ప్రకృతి ఆశ్రమంలో బ్రాహ్మణ కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం బ్రాహ్మణులకు పదవులు ఇచ్చేలా ప్రత్యేక జీవో విడుదల చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు చెరుకుపల్లి సంతోష్, సబ్బవీస్ కృష్ణ మోహన్, సంఘ అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్ కార్యదర్శి మారెళ్ల అఖిలేష్, చెరుకువాడ రంగసాయి, బ్రహ్మజోస్యుల ప్రసాద్, వేలూరి సుబ్రహ్మణ్యం, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, చందూరి కామేష్, మధిర అయ్యప్ప, కొమ్ము శ్రీనువాసు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇటీవల పదవులు పొందిన బ్రాహ్మణులను సత్కరించారు.

## సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి


మధులాష్‌బాబును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు, గ్రామస్తులు

పాలకోడేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కాలానికి అనుగుణంగా అన్వయించుకుని వినియోగించుకుటే అభివృద్ధి సాధ్యమని క్రొవ్విడి మధులాష్ బాబు అన్నారు. ఏఐ పరిజ్ఞానంతో కోళ్ల మరణాలకు చెక్ పెట్టే పరికరం రూపొందించి ప్రపంచ స్థాయి బహుమతి పొందిన మధులాష్ బాబును శృంగవృక్షంలో వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. మధులాష్ మాట్లాడుతూ సన్మానాలతో బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జుత్తుగ నాగరాజు మాట్లాడుతూ మధులాష్ బాబు లాంటి ఔత్సాహిక శాస్త్రవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిరంచర్ల సుబ్రహ్మణ్యం, కూర్మాల బులి నాగేశ్వరగుప్త, గ్రంధి రాజా మాట్లాడారు. ఎంపీటీసీ సత్యకృష్ణ, వైశ్య సంఘం ప్రతినిధులు రఘురాములు, కూర్మాల రాజా, పూర్ణారావు, సోము రామకృష్ణ, గాదం నానాజీ, నార్ని శ్రీనివాస్, పి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు. గొల్లలకోడేరు గ్రామంలోని కాళికా మాత ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

## పెట్టుబడుల సమ్మిట్ విజయవంతం


విలేకర్లతో మాట్లాడుతున్న వలవల బాబ్జి

పెంటపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈ నెల 14, 15 వ తేదీలలో జరిగిన పెట్టుబడుల సమ్మిట్ విజయవంతమైందని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. బాబ్జి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికోసం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, పద్మనాభుని మురళి, సబ్బీసు కృష్ణమోహన్, షేక్ బాజి ముత్యాల సత్యనారాయణ, దాట్ల జగన్నాధరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లులో ఏసీటీ సైన్స్ సెంటర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి

పాలకొల్లు అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో విద్యా చైతన్య సమాఖ్య, అల్లం రాజు చారిటబుల్ ట్రస్టు, క్రియా సొసైటీలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఏసీటీ సైన్స్ సెంటర్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) ఆదివారం ప్రారంభించారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనమని నిర్వాహకులను అభినందించారు. అల్లంరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అల్లంరాజు రామశాస్త్రి మాట్లాడుతూ సైన్స్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో మ్యాథ్స్ ల్యాబ్ కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. క్రియా సంస్థ కార్యదర్శి జగన్నాధరావు, విద్యా చైతన్య సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ సుమారు రూ6లక్షలతో ఏర్పాటు చేసిన సెంటర్ 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉపయోగించుకోవచ్చన్నారు. ఎంఈవో వీరాస్వామి, వై.అజయ్ కుమార్, కేవీ.రాయపరాజు, చినమిల్లి వెంకట్రావు, పులఖండం శ్రీనివాస్, తోలేటి గాంధీ, జె.నాగేశ్వరరావు, ఎం ఉమామహేశ్వరరావు, వంగా కరుణ్ కుమార్, చేగొండి కరుణకర్, డీవీవీ.ప్రసాద్ పాల్గొన్నారు.

## 50 మంది మహిళలకు కుట్టుమిషన్‌ల పంపిణీ


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

మొగల్తూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే ధ్యేయంగా రాజ్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే జానకి రామ్, టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. పేరుపాలెం సెంటర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాజ్ కుమార్ ట్రస్ట్ నుంచి 50 మంది మహిళలకు కుట్టుమిషన్లు, రూ.500 నగదు, సర్టిఫికెట్లను అందజేశారు. దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, ట్రస్ట్ వ్యవస్థాపకుడు గంటా రాజ్ కుమార్ మాట్లాడుతూ 3వేల మంది మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ లక్ష్యమన్నారు. సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఇంజేటి జాన్ కెనడి, పడవల సత్యనారాయణ, కొల్లాబత్తుల రవికుమార్, కాకిలేటి ఆనంద కుమార్, తిరుమాని నర్సింహరాజు, వర్ధనపు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

**పాసపోర్టు పోయినది**

ది.10.11.2025 వ తేదిన నా యొక్క పాస్ పోర్టునెం. ఎమ్. 3093020 గల పాస్ పోర్టు చెరుకువాడ నుండి జిరాక్స్ సెంటర్‌కు మోటార్ సైకిల్ పై వెళ్ళుచుండగా దారిలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు ఈక్రింది చిరునామాకు తెలియ చేయవలసినదిగా యావన్మందిని కోరడమైనది.

సవరపుధనలక్ష్మి W/o. జోషి, చెరుకువాడ - 534 199 ఉండి మండలం, ప.గో.జిల్లా ఫోన్: 7780772758

## బస్సు కింద పడిన మహిళ

భీమవరం క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఎక్కుతూ కిందపడిన మహిళ కాలికి గాయమైంది. ఉండి మండలం చిలుకూరుకు చెందిన ఎస్.మార్తమ్మ భీమవరం నుంచి బస్సులో వెళుతోంది. జంట కాలువల వద్ద బస్సు ఆగడంతో ప్రయాణికులంతా దిగి, తిరిగి ఎక్కుతున్న సమయంలో ఆమె బస్సు కింద పడిపోయింది. కాలికి గాయం కాగా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు భీమవరం టూటౌన్ పోలీసులు తెలిపారు.




# ఆలయాల్లో కార్తీక అన్న సమారాధన


కాళ్లకూరు వేంకటేశ్వరాలయంలో అన్న సమారాధన

భీమవరం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం సోమేశ్వరాలయంలో కార్తీకమాసం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ఆదివారం ప్రారంభించారు. ముందుగా ఆలయ అర్చకులు చెరుకూరి రామకృష్ణ, కందుకూరి సోంబాబులు కుంభానికి పూజలు చేయించి హారతులు ఇప్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, చైర్మన్ చింతలపాటి బంగ్రా రాజు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద కార్తీక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కుక్కల బాల, కడలి వెంకటేశ్వరరావు, ల్లూరి బంగ్రరాజు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, నళిని మోహన్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**కాళ్ల:** కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పలు రకాల వంటలతో నైవేద్యం సమర్పించి అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం ఈవో ఎం.అరుణ కుమార్ పర్యవేక్షించారు.

**తణుకు రూరల్:** మండలంలోని దువ్వ గ్రామంలో వేంచేసియున్న శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయ పరిశరాల్లో కార్తీక వన సమారాధన కార్యక్రమాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

**ఆచంట:** కాపు సంఘం ఆధ్వర్యంలో ఆచంటేశ్వరునికి లక్షపత్రి పూజ నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామి వారికి లక్షపత్రి పూజ నిర్వహించగా అనేక మంది కాపు కులస్థులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వన విహార్‌తో ఆధ్యాత్మిక భావన

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



పూజలు నిర్వహిస్తున్న మంత్రి శ్రీనివాసవర్మ తదితరులు

భీమవరం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వన విహార్ వంటి కార్యక్రమాలు ఆధ్యాత్మిక భావన, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పట్టణంలోని ప్రకృతి ఆశ్రమం తోటలో ఆదివారం హిందూ వన విహార్ కార్యక్రమం వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ఘనంగా జరిగింది. కార్తీక మాసం పవిత్రతను, హిందూ ధార్మిక జీవన మౌలిక సిద్ధాంతాలను భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని కన్వీనర్ మంతెన రామచంద్రరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్తీక మాసంలో కుల ప్రాంతాలకు అతీతంగా, హిందూ ధర్మానికి చెందిన జీవన మౌలిక సిద్ధాంతాలను, వన భోజనాల విశిష్టతను భవిష్యత్ తరాలకు అందించాలనే పవిత్ర సంకల్పంతో ఆర్ఎస్ఎస్ ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. తాడేపల్లి శివకేశవ పీఠం వ్యవస్థాపకులు మాతా శివానంద సరస్వతి, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ విజయాదిత్య మాట్లాడారు. ముందుగా వన విహార్‌లో కార్తీక దామోదర పూజ చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, కలిదిండి వినోద్‌వర్మ, తోట గంగరాజు, సుభాష్ రాజు పాల్గొన్నారు.


పాలకోడేరులో అయ్యంకి, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాల వద్ద నివాళి


పాలకొల్లు గ్రంథాలయంలో క్విజ్ పోటీలో విద్యార్థులు

# గ్రంథాలయాల సందర్శనతో విజ్ఞానం

భీమవరంటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల సందర్శనతో విజ్ఞానం పొందవచ్చని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జేసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగ భూషణం, ఎస్ఆర్ రంఘనాథన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పిల్లలలో పుస్తక పఠనంపై అవగాహన అవసరమన్నారు. గ్రంథాలయానికి వాటర్ ప్లాంట్, రెండు కంప్యూటర్లు, ప్రింటర్, ఇన్వర్టర్ సదుపాయం కల్పించిన దాతలను జేసీ అభినందించారు. గ్రంథాలయంలో చదువుకొని వివిధ పోటీ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించారు. లైబ్రేరియన్ ఎస్.వెంకటేశ్వరరావు, వబిలిశెట్టి కనకరాజు, బలివాడ సాయి ప్రసాద్, యేలేటి న్యూటన్, అల్లూరి నరసింహరాజు, కాలిగొట్ల గోపాలశర్మ, జి.నాగరాజు, మూర్తి, ఎస్కే బాబా సాహెబ్, అల్లు శ్రీనివాస్, సిబ్బంది విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

టీటీడీ నిర్వహిస్తున్న వేంకటేశ్వర బధిర పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆటలు, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. షటిల్, రోప్ స్కిప్పింగ్, వాలీబాల్, రన్నింగ్ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. చెరుకువాడ రంగసాయి, అరస వల్లి సుబ్రహ్మణ్యం, డీఎన్నార్ కళాశాల లైబ్రేరియన్ శిరీష, పీఈటీ లక్ష్మణ్, ఉపాధ్యాయులు గాయత్రి, హిమబిందు, విజయ పద్మ పాల్గొన్నారు.

**పాలకోడేరు:** గ్రంథాలయోద్యమం, అభివృద్ధి కారకులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శాఖా గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయ శాస్త్రంలో విశేష కృషి చేసిన ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**తణుకు:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి, కోటరామ ప్రసాద్, కౌరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రంగస్థల కళాకారుడు కోపల్లె శ్రీనివాస్ విద్య ఆవశ్యకత వివరించారు. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాస్, ప్రత్తి వీరాస్వామి, ఎ.జనార్ధనరావు, వీఎస్.లక్ష్మణరావు, టీచర్ ఇంద్రవాణి, తదితరులు పాల్గొన్నారు.

**పాలకొల్లు అర్బన్:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి వి.శాంతకుమారి ఆధ్వర్యంలో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ హైస్కూల్స్ నుంచి విద్యార్థినీ, విద్యార్థులు 50 మంది పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సత్యవాణి, భాస్కరరావు పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు బైలాశ్రీధర్, కె.కళ్యాణ్, కేవీవీ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అయ్యంకి వేంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ జీవిత విశేషాలను విశ్రాంత ఉపాధ్యాయుడు మాడభూషి కృష్ణ ప్రసాద్ వివరించారు. ఉపాధ్యాయులు యు.పెద్దిరాజు, జి.సీతారామ్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షీరా రామలింగేశ్వరస్వామికి పూజలు


జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈవో

పాలకొల్లు అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామికి జీఎస్టి అసిస్టెంట్ కమిషనర్ శైలజశ్రీ, డిప్యూటీ డైరెక్టర్ ఫైనాన్స్ కళ్యాణి, ట్రెజరీ అధికారి మాధవి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అమ్మవార్లకు కుంకుమ పూజల అనంతరం స్వామివారి చిత్రపటాలను, శేషవస్త్రాలను ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది అందజేశారు. ఆలయ పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు.

## ముత్యాలమ్మను దర్శించుకున్న భక్తులు

మొగల్తూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. పేరుపాలెం, కెపిపాలెం సాగర తీరాలకు వెళ్లే సందర్శకులు అమ్మవారిని దర్శించుకుని వెళ్లారు. భక్తులు దూపహారం, కుంభహారాలను అమ్మవారికి నివేదించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈవో మోకా అరుణ్ కుమార్ ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## అర్ధవరంలో వైభవంగా కోటి దీపోత్సవం


ఎమ్మెల్యే ధర్మరాజుకు శివుడి విగ్రహం బహూకరణ

గణపవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైందవ సనాతన ధర్మం ప్రపంచానికి దిక్సూచి అని పలువురు వక్తలు అన్నారు. అర్ధవరంలో తులసి దాత్రీ సమేత లక్ష్మీనారాయణ పూజ, శివపార్వతుల కల్యాణం, శివకేశవుల పుష్పయాగం, కోటి దీపోత్సవం ఆదివారం నిర్వహించారు. గరగ నృత్యాలు, కోలాట నృత్యాలతో బాణసంచా, మేళతాళాలతో స్వామివార్లను ఊరేగించారు. అనంతరం వాడపల్లి వేంకటేశ్వరస్వామి, బాల వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అఖండ అన్న సమారాధన జరిగింది. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎంపీపీ దండు వెంకట్రామరాజు, నారాయణరాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధుడికి సత్కారం


కనకయ్యను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మోదుగగుంటలో శతాధిక వృద్ధుడు చనుబోయిన కనకయ్య (105) సగర సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏపూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో సత్కరించారు. నియోజకవర్గ సగర సంఘ కార్తీక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. కర్నాటి కన్నయ్య, కర్నాటి పోలిరెడ్డి, గుళ్లపల్లి కొండలరావు, ఏపూరి నాగరాజు, చంద్రు బుజ్జియ్య, మెండెల్లి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

తణుకు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయి అన్నారు. గోటేరులో ఎన్ఎస్ఎస్ శిబిరంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ జె.కిషోర్‌బాబు, పట్టెం రాంబాబు, రమేష్‌బాబు, శ్యామలాదేవి పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం

నరసాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొండామ్మ వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం బొమ్మిడి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎమ్మెల్యే నాయకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సతీమణి సునీత పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. రవీంద్ర, సూర్యకుమారి, కృష్ణవేణి, వలవల సావిత్రి, మీనాక్షి, ఝాన్సీ, రాణి, కిరణ్ పాల్గొన్నారు.


టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళలు కోలాట భజన నిర్వహించారు. గురువులు అల్లు తిరుపతిరావు, వల్లపు సత్యనారాయణ పర్యవేక్షించారు. - తణుకు, ఆంధ్రజ్యోతి